## దూరవిద్య ఎంసీఏ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూర విద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే ఎంసీఏ కోర్సు రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## బీఎఫ్ఏ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ (అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్, ఫొటోగ్రఫీ) రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 27లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ. 500 అపరాధ రుసుంతో 30వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలని సూచించారు.

## సరస్వతీ పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బాలానగర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో నిర్వహించే సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరి తెలిపారు. ఈ నెల 15 నుంచి 26 వరకు పుష్కరాల నేపథ్యంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఏదైనా కాలనీలో 40 మంది ప్రయాణికులు ఉంటే వారికోసం బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 89194 93417 లో సంప్రదించాలని సూచించారు.

జీడిమెట్ల : కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రంలో జరిగే సరస్వతిదేవి పుష్కరాలకు ఆర్టీసీ నుంచి 15 నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని జీడిమెట్ల డిపో మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. 15 నుంచి 26 తేదీ వరకు గండి మైసమ్మ, అపురూప కాలనీ , జగద్గిరిగుట్ట స్పెషల్‌మెట్రో, డీలక్స్ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. పెద్దలకు రూ.820, పిల్లలకు రూ.420 ఉంటుందని బస్తీ నుంచి 35 నుంచి 40 మంది ఉంటే డీఎం 99592 26150, సూపర్‌వైజర్ 73828 17481కు తెలియజేయాలనారు.

# మణికొండలో జలదోపిడీ 'జలగలు'

- అక్రమ సంపాదనే లక్ష్యంగా అధికారుల పనితీరు
- సక్రమంగా నీటి సరఫరా కావాలంటే చేయ్యి తడపాల్సిందే
- అడ్డగోలు వసూళ్లపై మండిపడుతున్న ప్రజానీకం
- ఓ వైపు దాహార్తి... మరోవైపు ధన దాహార్తి
- విచారణ జరపాలంటున్న పలు కాలనీల ప్రజలు

అసలే మండుతున్న ఎండలు...ఆపై తాగునీటి సమస్యలు..ఓ వైపు దాహార్తి మరోవైపు ధన దాహార్తిగా మణికొండలోని జలమండలి శాఖలో అవినీతి జలదోపిడీ జలగలు రాజ్యమేలుతున్నాయంటూ గొంతెండుతున్న గొంతులు బోరుమంటున్నాయి. ప్రజల దాహార్తిని తీర్చేందుకు తమవంతుగా కృషిచేస్తున్నామంటూ ఓ వైపు జలమండలిశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నా...క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఆ శాఖ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటూ సకాలంలో నీటి సరఫరా చేయాల్సిన జలమండలి అధికారులు అక్రమ వసూళ్ల మత్తులో మునిగి ప్రజల నుంచి అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇదే శాఖలో అవినీతికి పాల్పడి రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కిన ఉదంతాలు ఉన్నాయి. అంతకు మించి ఓ ఉన్నతాధికారి ఇక్కడ అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతూ ..క్షేత్రస్థాయి సిబ్బందిని సైతం వేసవి ముగిసేలోపు అక్రమ సంపాదన చేసుకోవాలంటూ హుకూం జారీచేసినట్లు తెలిసింది. ఇదే అదనుగా భావించి నీటి సరఫరా లైన్‌మెన్లు, ట్యాంకర్ డ్రైవర్లు, వీరంతా కాలనీల్లో దోచుకుంటుంటే... ఆ అధికారి మాత్రం అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు బల్క్‌గా నీటి కనెక్షన్లు కావాలంటే లక్షల్లో డిమాండ్ చేస్తూ సొమ్ముచేసుకుంటున్నట్లు సమాచారం. ఇంత బహిరంగంగా జలమండలిశాఖలో అక్రమార్జన రాజ్యమేలుతోంది. – మణికొండ, మే 14

- పూర్తి వివరాలల్లోకి వెళితే....మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని జలమండలిశాఖ సెక్షన్–18 పరిధిలో నీటి సరఫరా జరిగే ప్రతి చోటా చేయి తడపందే నీటి సరఫరా జరగడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వేసవికాలంలో సకాలంలో నీటిని అందించాల్సిన జలమండలిశాఖ సిబ్బంది అడ్డగోలుగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారని చెబుతున్నారు. అసలే శుభకార్యాలయాలు జరిగే ఈ సీజన్‌లో నీటి ట్యాంకర్లు కావాలంటే ఉన్న ధర కన్నా రెట్టింపు చెల్లిస్తేనే ట్యాంకర్ వస్తుంది లేదంటే..ఎవ్వరూ స్పందించక పోగా...ట్యాంకర్ మరోచోట ఉంది ఇదిగో వస్తోందంటూ గంటలు, రోజుల తరబడి కాలయాపన చేస్తుంటారని కాలనీ ప్రజలు మండిపడుతున్నారు.
- ఇక రోజు తప్పి రోజు సరఫరా అయ్యే నీటిలోనూ గంట పాటు వదులుతున్నామంటూ అరగంటలోనూ నిలిపివేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇదేమిటనీ ప్రశ్నిస్తే ఏమైనా చూడాలంటూ జలమండలి లైన్‌మెన్లు చేతులు చాస్తున్నారని చెబుతున్నారు. ఇంత బహిరంగంగా జలమండలిశాఖ ఉన్నతాధికారుల నుంచి సిబ్బంది వరకు వేసవికాలంలో అడ్డగోలు వసూళ్లు చేస్తుండటంపై ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



### అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలే వారి లక్ష్యం

మణికొండ జలమండలి కార్యాలయంలో విధులు నిర్వహించే ఇద్దరు ఉన్నతాధికారులు ప్రతిరోజూ ఆయా గేటెడ్ కమ్యూనిటీలు, అపార్టుమెంటు వాసులతో కలిసి అక్కడ నీటి సరఫరాపై లెక్కలు, లావాదేవీలపై పనిచేస్తున్నారే తప్ప సామాన్య, మధ్య తరగతి ప్రజలు సమస్యలపై ఎక్కడ పర్యటించి పరిస్థితులు తెలుసుకున్న దాఖలాలు లేవని ప్రజలు అంటున్నారు. రాత్రింబవళ్లు సంపన్న వర్గాలతో కలిసి మందు చిందులతో విధులు నిర్వహిస్తూ కేవలం సంపాదనే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న ఆ అధికారుల తీరుపై పూర్తిస్థాయి విచారణ జరిపాలని ఉన్నతాధికారులకు స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తదితరులు

శంషాబాద్ రూరల్, మే 14: కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పంపిణీ చేశారు. బుధవారం శంషాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ రవీందర్ దత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ఇంటి ఆడబిడ్డల పెండ్లిలకు అండగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకం ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మున్ని, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, సహకార సంఘం చైర్మన్ దవణాకర్‌గౌడ్, చంద్రారెడ్డి, నీరటి రాజుముదిరాజ్, మహేందర్‌రెడ్డి, సత్యానందం, శ్రీకాంత్‌గౌడ్, నరేష్‌గౌడ్, ఆర్ఐలు కృష్ణ, సారిక ఆయా గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మత విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

హిమాయత్‌నగర్, మే14: దేశంలో మోదీ అనుసరిస్తున్న మత విద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ.నరసింహ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు ఏపీ రాష్ట్రంలోని తిరుపతి నగరంలో నేటి (గురువారం ) నుంచి 18 వరకు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం హిమాయత్‌నగర్‌లో ఫ్లాగ్ మార్చ్ పేరిట జాతాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటి నరసింహ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, వికృత రాజకీయాలకు పాల్పడే బీజేపీ ప్రభుత్వాన్ని ఉద్యమాలతో నిలదీయాలన్నారు. ఈ మహాసభలలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, నేతలు నెర్లకంటి శ్రీకాంత్, సత్య ప్రసాద్, సల్మాన్ బేగ్, షేక్ మహమూద్, మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, హేమంత్, వంశీ,మోసిన్ ఖాన్,మహేష్, భరత్, మురళి, నవీన్, కీర్తన్ పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనుల పరిశీలన



ప్రసాద్‌నగర్ కాలనీలో డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ, మే 14: ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర పేర్కొన్నారు. కమిషనర్ శరత్‌చంద్ర సమక్షంలో వన్డే వన్ థీమ్ అనే కార్యక్రమంలో భాగంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్ నగర్‌లో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

## వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలి



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ మంజులకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బండ్లగూడ, మే 14: వీధి దీపాల సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలు కాలనీవాసులు బండగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ మంజులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ఆస్తిపన్ను వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధ సమస్యల పరిష్కారానికి చూపడం లేదని తెలిపారు. ఓం నగర్, ధాత్రి కాలనీవాసులు కలిసి స్ట్రీట్ లైట్ల కోసం ఏర్పాటు చేసుకున్న వైర్లను సైతం కార్పొరేషన్ లైన్మెన్లు తీసుకెళ్లారని ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా విద్యుత్ దీపాల మరమ్మతుల కోసం ఏర్పాటు చేసిన సూపర్‌వైజర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు కూడా విద్యుత్ దీపాలు వెలగకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఓంనగర్ కాలనీ అధ్యక్షుడు మన్నె నవీన్ కుమార్, ధాత్రి కాలనీ అధ్యక్షులు శివారెడ్డి, కాలనీవాసులు ఆనంద్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.






పాన్‌షాప్ నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ సురేందర్

## నిషేధిత పదార్థాలు అమ్మొద్దు

ఎర్రగడ్డ: బోరబండ పోలీసులు ఠాణా పరిధిలోని పాన్ దుకాణాల నిర్వాహకులతో సమావేశమై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సీజన్స్ ఫంక్షన్ హాల్లో బుధవారం జరిగిన ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సురేందర్ మాట్లాడుతూ గుట్కా, ఖైనీ, తంబాకు వంటి నిషేధిత పదార్థాలు విక్రయించవద్దని పేర్కొన్నారు. 18 ఏండ్ల లోపు వాళ్ల కు సిగరెట్లు, నిషేధిత వస్తువులను అమ్మొద్దని సూచించారు. ఇక ప్రతి పాన్ షాప్ లైసెన్సు తో రిజిస్టర్ అయి ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఠాణా ఎస్సైలు, సిబ్బంది, సుమారు 60 మంది పాన్ షాప్ నిర్వాహకులు పాల్గొన్నారు.



## ఉచిత దంత వైద్యశిబిరం

బంజారాహిల్స్‌లోని డా. గౌడ్స్ డెంటల్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న వారి కోసం శామీర్‌పేటలోని ఏకే.కుంద్రాస్ ఆటిజం ఆశ్రమ్‌లో బుధవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. దవాఖాన చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన ఈ ప్రత్యేక శిబిరంలో ఆటిజం బాధితులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించడంతో పాటు నోటి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దంత సమస్యలు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాన్ని వారికి నేర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు డా. వికాస్ గౌడ్‌తో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు. బంజారాహిల్స్,మే 14:

## రహదారులను పునరుద్ధరించండి

### గుడ్ మార్నింగ్ ప్రజాభిప్రాయ సేకరణలో బీఆర్ఎస్ నాయకులు



మనకొండ మున్సిపాలిటీలో గుడ్ మార్నింగ్ మణికొండ ప్రజాభిప్రాయ సేకరణలో సమస్యలు తెలుసుకుంటున్న బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు

మణికొండ, మే 14 : మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రజాభిప్రాయ సేకరణ' కార్యక్రమంలో భాగంగా బుధవారం అల్కాపూర్ టౌన్షిప్ రోడ్డు నంబర్ 4 పక్కన ఉన్న స్థానిక ప్రజలతో కలిసి నాయకులు వారి ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

- సెక్టార్ వన్ డీ బ్లాక్ రోడ్డు నంబర్ 4లో పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉన్నదని కోరారు.
- అల్కాపూర్ టౌన్షిప్ నుంచి నార్సింగ్ రోడ్డు సాయి గౌతమ్ కాలనీ మీదుగా పుప్పాలగూడ రోడ్లు చాలా కాలం నుంచి అందుబాటులోకి రాని కారణంగా అల్కాపూర్ టౌన్షిప్ నుంచి వచ్చే ట్రాఫిక్‌కు సరైన రోడ్డు మార్గం లేక స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయారు.
- వీధి కుక్కల బెడద అధికంగా ఉండడంతో పలుమార్లు మణికొండ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు పరిష్కారం కాలేదు. అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.
- అల్కాపూర్ టౌన్షిప్ వాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న విషయాన్ని హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తేవడం ద్వారా తగు చర్యలు తీసుకోగలమని హామీ ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీద నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, సంఘం శ్రీకాంత్, భానుచందర్, ఆరీఫ్ మహమ్మద్, శ్రీధర్, షైక్ ఆరీఫ్, సుమనళిని, చెరుకూరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడి

బంజారాహిల్స్,మే 14: పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించి యువతిపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడడంతో పాటు డబ్బులు తీసుకుని ఉడాయించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..ఢిల్లీ సమీపంలోని ఘజియాబాద్ ప్రాంతానికి చెందిన యువతి(28) ఎంబీబీఎస్ పూర్తిచేసి కాస్మోటాలజీలో స్పెషలైజేషన్ చేసింది. బంజారాహిల్స్‌లోని ఓ సంస్థ లో స్కిన్ అండ్ హెయిర్ స్పెషలిస్ట్‌గా ఆరునెలల క్రితం చేరింది. అదే సంస్థలో హెచ్‌ఆర్ హెడ్‌గా పనిచేస్తున్న భరత్ (33) అనే వ్యక్తితో పరిచయం ఏర్పడిం ది. యువతిని ప్రేమిస్తున్నానని నమ్మించడంతో పాటు పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. కొన్నాళ్ల తర్వాత వీరిద్దరినీ ఉ ద్యోగంలో నుంచి తీసేయడంతో బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 14లో సొంతం గా వ్యాపారం ప్రారంభించారు. దీనికోసం యువతివద్దనుంచి భరత్ సుమా రు రూ.2.5లక్షలు తీసుకున్నా డు. కాగా ఇటీవల భరత్‌కు ముందే పెండ్లి అయిందని తేలడంతో అతడు నివాసం ఉంటున్న ఫ్లాట్‌కు వెళ్లి చూడగా ఆరునెలల గర్భంతో ఉన్న భార్య కనిపించింది. తనను మోసం చేసిన భరత్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత యువతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బీఎన్ఎస్ 69 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సీబీఎస్ఈ పది ఫలితాల్లో 'ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్' సత్తా



తండ్రులను కోల్పోయి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రార్థన

హిమాయత్ నగర్, మే 14: సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాల్లో హిమాయత్ నగర్ లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుధవారం స్కూల్ వైస్ చైర్‌పర్సన్ మణికొండ ప్రార్థన, కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ సత్కారం చేశారు. పరీక్షల సమయంలో నివృత్తి సంజీవ్ బహేటి, రుషిక జక్కుల అనే ఇద్దరు విద్యార్థినీలు తండ్రులను కోల్పోయారని, ఆ సమయంలో దుఃఖాన్ని దిగమింగి మొక్కవోని ధైర్యంతో విద్యార్థినీలు పరీక్షలు రాసి ఉత్తీర్ణత పొందారని మణికొండ ప్రార్థన తెలిపారు. ఈ ఫలితాల్లో పోలేపెద్ది లాస్య శ్రీకరి, అర్సిల్ రాహుల్, బండారు వీఏ అగస్త్య, శ్రేయాంష్ మెహతా, భగవాని, ఆర్కిట్, బౌమిక్ ఎస్ వీఎన్ ఎల్ నాయుడు, సంజన చౌహాన్, కునాల్ సింగ్, సాయి విదాత్, నేహాల్, భువన కుమార్, పృథ్వీ అగర్వాల్, పునీత్ శర్మ మంచి ఫలితాలు సాధించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీన్ రామాంజుల, సీబీఎస్ఈ ప్రిన్సిపాల్ సీహెచ్ రేఖా రావు. ప్రీప్రైమరీ ప్రిన్సిపాల్ ఫాతిమా ఖాజిమ్,అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పై కేసు నమోదు

బంజారాహిల్స్: రాంగ్ రూట్‌లో కారు నడుపుతూ రావడంతో పాటు ట్రాఫిక్ పోలీసులు ఆపినా ఆగకుండా వెనక్కి తిప్పుకుని వెళ్లిన ఘటనలో సినీ నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మీద జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీ చౌరస్తా లో మంగళవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45 వైపు నుంచి వస్తున్న సినీ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ జర్నలిస్ట్ కాలనీ వద్ద రాంగ్ రూట్లో వెళ్లేందుకు ప్రయత్నించాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ అతడి కారును ఆపి, రాంగ్ రూట్లో ఎలా వెళ్తావంటూ ప్రశ్నించాడు. కానిస్టేబుల్ వైపు కోపంగా చూస్తూ వేగంగా కారు వెనక్కి తిప్పి ఆపకుండా వెళ్ళిపోయాడు. అతడి వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీస్ ఉన్నతాధికారుల సూచనతో బుధవారం ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మీద కేసు నమోదు చేశారు.

## మణికొండ డాలర్స్ కాలనీలో హైడ్రా కమిషనర్ పర్యటన

మణికొండ, మే 14 : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్ హిల్స్ కాలనీలో స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం పర్యటించారు. పార్కు స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నాయని డాలర్ హిల్స్ కాలనీవాసులు హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో కమిషనర్ రంగనాథ్ స్వయంగా చేరుకొని పార్కు స్థలం కబ్జా అయిన ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం నిర్మాణదారులు మాట్లాడుతూ పార్కు స్థలం తాము కొనుగోలు చేయలేదని, డబ్బులు పెట్టి ల్యాండ్ కొనుగోలు చేసి ప్రభుత్వ అనుమతులు పొంది నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఇరువర్గాల వాదనలు విన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇరు వర్గాల మధ్య ఉన్న డాక్యుమెంట్స్ పరిశీలించి, మీటింగ్ ఏర్పాటు చేసి అనంతరం సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాలర్ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్‌కు ఇబ్బందిగా కటౌట్లు

కటౌట్లు తొలగించక ట్రాఫిక్ సమస్య వస్తే.. కనీసం అధికారులు స్పందించడం లేదని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రధాన చౌరస్తాల వద్ద భారీ కటౌట్‌లు పెట్టి అధికార పార్టీల నాయకులు రోడ్లను ఆక్రమించి వాహనదారులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు కాంగ్రెస్ వారికి వర్తించవా అని ప్రశ్నించారు. రోడ్డు పక్కన వెహికల్ ఆపితే చాలు చలాన్లు వేసే ట్రాఫిక్ అధికారులు అధికార పార్టీ వారు రోడ్డునే ఆక్రమించుకొని కటౌట్లు పెడితే చూసీచూడనట్లు ఉంటారా అని ప్రశ్నించారు. – మైలార్‌దేవ్‌పల్లి, మే 14:



సన్మానం: మహారాష్ట్రలోని పుణెలో జరిగిన ఆర్మీ గర్ల్స్, బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ ర్యాలీలో ప్రతిష్టాత్మక ఆర్మీ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్‌లో నార్సింగి ఫ్రెండ్స్ అండ్ ఆర్చర్స్ అకాడమీకి చెందిన కె పూర్ణచంద్ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీలో మేడిచెల్మె సహస్ర గర్ల్స్ స్పోర్ట్స్ కంపెనీ ఆర్చరీ విభాగంలో అర్హత సాధించిన సందర్భంగా నార్సింగ్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ప్రవల్లిక కిరణ్, కాంగ్రెస్ నాయకులు వినోద్ కుమార్ కలిసి సన్మానించారు. – మణికొండ



శుభాకాంక్షలు: రాష్ట్ర ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ కమిషన్ సభ్యులుగా ఇటీవల శ్రీనివాసరావు(ఫైనాన్స్), రఘు(టెక్నికల్) నియమితులయ్యారు. తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ యూనియన్–1535 ప్రతినిధులు బుధవారం వారిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బండారి నగేష్, సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు సిగ్ర ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎర్రగడ్డ

## పర్మిట్ రూమ్‌లో గొడవ

### వ్యక్తిపై దాడి

బంజారాహిల్స్,మే 14: పర్మిట్ రూమ్‌లో బీర్ బాటిల్ పగలగొట్టవద్దని చెప్పినందుకు ఓ వ్యక్తిని చితకబాదిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నవనిర్మాణ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఏ.అశోక్‌కుమార్ అనే వ్యక్తి కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. మంగళవారం సాయంత్రం ఫిలింనగర్‌లోని గోల్డ్‌స్పాట్ వైన్‌షాపునకు వెళ్లిన అశోక్ కుమార్ పర్మిట్ రూమ్‌లో కూర్చుని మద్యం సేవిస్తున్నాడు. పక్కన కూర్చున్న ఓ వ్యక్తి మద్యం మత్తులో బీర్ బాటిల్‌ను పగలగొట్టడంతో అశోక్‌కుమార్ వారించాడు. బీర్ బాటిల్ పగలగొట్టడం వల్ల పక్కనున్న వ్యక్తులు గాయపడే ప్రమాదం ఉందని చెప్పడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. కాసేపు గొడవపడి బయటకు వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తి మరో ఇద్దరిని తీసుకొచ్చి అశోక్ కుమార్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడు ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



నివాళి: ఇండియా– పాకిస్థాన్ దేశాల మధ్య జరిగిన దాడుల్లో దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్‌కు శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లి పాతతండాలో గ్రామంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శంషాబాద్ రూరల్


## బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మా క్లయింట్లు షెడ్యూల్‌లో వివరించిన విధంగా షెడ్యూల్ ఆస్తులకు సంబంధించి షెడ్యూల్ ఆస్తి ఏకైక మరియు పూర్తి యజమానులు మరియు శాంతియుత స్వాధీనదారులుగా క్లెయిమ్ చేయబడుతున్న a) తుంగ రాంరెడ్డి తండ్రి టి.యాదిరెడ్డి, b) తుంగ సత్యనారాయణ రెడ్డి తండ్రి టి.యాదిరెడ్డి, c) తుంగ సుమన్ రెడ్డి తండ్రి టి.యాదిరెడ్డి, d) తుంగ శ్రీనివాస్ రెడ్డి తండ్రి టి.యాదిరెడ్డి, e) తుంగ నర్సింహ్మా రెడ్డి తండ్రి టి.బాల్‌రెడ్డి, f) తుంగ ఇంద్రా రెడ్డి తండ్రి తుంగ నర్సింహ్మా రెడ్డి మరియు g) టి.సికిందర్ రెడ్డి తండ్రి తుంగ నర్సింహ, అందరి నివాసం: ఉప్పర్‌పల్లి గ్రామం, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రాజేంద్రనగర్ సర్కిల్, రంగారెడ్డి జిల్లా వారి నుండి 25 సంవత్సరాల కాలానికి లీజు డీడ్ కుదుర్చుకోవాలని ఉద్దేశిస్తున్నారు.

షెడ్యూల్ ఆస్తిలో ఎవరైనా వ్యక్తి/లు ఏదేని హక్కు, టైటిల్, అభ్యంతరం,క్లెయిమ్‌లు లేదా ఏదేని స్వభావం కలిగిన ప్రయోజనం కలిగి ఉంటే, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 10 (పది)రోజులలోగా దాని యొక్క డాక్యుమెంటరీ రుజువుతో దిగువ సంతకందారుకు తెలియజేయవల్సిందిగా ఇందుమూలముగా కోరబడుతున్నారు. సదరు కాలవ్యవధి తర్వాత షెడ్యూల్ ఆస్తికి సంబంధించి ఏ విధమైన క్లెయిమ్ అనుమతించబడదు.

### షెడ్యూల్

ఉప్పర్‌పల్లి గ్రామం, హ్యాపీ హోమ్స్ కాలనీ, రాజేంద్రనగర్ మండలం, GHMC రాజేంద్రనగర్ సర్కిల్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ వద్ద గల సర్వే నెం.127/A మరియు 127/AAలో 4154 చ.గజాలు విస్తీర్ణపు భూమి యావత్తు, సరిహద్దులు:

| దిక్కులు | సరిహద్దులు |
|---|---|
| ఉత్తరం | పొరుగువారి భూమి |
| దక్షిణం | పొరుగువారి భూమి |
| తూర్పు | 40 అడుగుల వెడల్పు రోడ్ |
| పడమర | 30 అడుగుల వెడల్పు రోడ్ |

15.5.2025

సం/– ఆర్. యల్లా రెడ్డి, ఆర్. వరలక్ష్మి,
M/s. యల్లా లీగల్, అడ్వకేట్స్
302, మా నివాస్, ప్లాట్ నం. 90/MIG, ఫేస్–II,
ధర్మారెడ్డి కాలనీ, హైదర్‌నగర్, హైదరాబాద్ – 085,
ఇ–మెయిల్: yellareddy@yellalegal.com;
మొబైల్: 9246530551.